క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాదన్నపేట, వాహీద్‌నగర్ కాలనీ, రెయిన్‌బజార్, చమన్, ఫూల్‌బాగ్, భరత్ నగర్, మాదన్నపేట పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్, అజాద్‌పార్క్, మాదన్నపేట పరిసరాలు.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లక్ష్మీనగర్ క్రాస్‌రోడ్, రామాలయం, వాణీనగర్, పటేలమ్మ మడిగ, ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ, దోభీఘాట్ రోడ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

నేడు ఇస్కాన్ మఠంలో హనుమాన్ జన్మోత్సవం

చంచల్‌గూడ: కుర్మగూడలోని ఇస్కల మఠం హనుమాన్ ఆలయంలో ఆదివారం హనుమాన్ జన్మోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు కృష్ణమాచారి తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి అభిషేకం, యజ్ఞం, చాలీసా పఠనం ఉంటుందన్నారు.

గీత కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



రవికుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుడు పల్లె రవికుమార్‌గౌడ్ తెలంగాణ గీత కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం సరూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జక్కుల శ్రీశైలంయాదవ్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ నాయకులు ఆనంద్‌గౌడ్, బాలగౌడ్, జయశంకర్‌గౌడ్, ఐలయ్య యాదవ్, అశోక్‌గౌడ్ ఆయనను సన్మానించినవారిలో ఉన్నారు.


పరస్పర అవగాహనతోనే అభివృద్ధి సాధ్యం



సీసీ రోడ్డు పనుల ప్రారంభించిన అబ్దుల్లా సాది

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్, మజ్లిస్ పరస్పర అవగాహనతోనే జల్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి సాధ్యమవుతుందని జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. ఎర్రకుంటలోని వార్డు–27లో రూ.37.5 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన స్థానిక బీఆర్‌ఎస్ కౌన్సిలర్ నూరా ఎక్బాల్ ఖలీఫాతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సి పాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే పూర్తయిన ప్రధాన రహదారులతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మంత్రి సబితారెడ్డి ఎప్పటికప్పుడు చొరవ తీసుకుంటూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయడం హర్షణీయమన్నారు.

మురుగు పారుతున్నా పట్టదా?



20వ వార్డు ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు

పహాడీషరీఫ్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీ మురుగుకు నిలయంగా మారింది. 17, 18, 19, 20 వార్డుల పరిధిలో ఉండే ఈ కాలనీలో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో నివాసం ఉంటున్నారు. ఇటీవల ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చించడంతో ప్రధాన రహదారుల పనులు పూర్తయ్యాయి. కానీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల వ్యయంతో వెచ్చించి నిర్మించిన రహదారులపై పారుతున్న మురుగుతో అవి మూన్నాళ్లకే పాడయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. 19వ వార్డులో భారీగా పొంగుతున్న మురుగునీరు ప్రధాన రహదారిపై పారుతుండటంతో వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. ఈ నీరంతా ఓపెన్‌గా పారుకుంటూ వెళుతూ దిగువన ఉన్న ఎర్రకుంటలో కలుస్తుంది. దీంతో పాటు 20వ వార్డులో ఫిరంగి నాలా పక్కన డ్రైనేజీ పైప్‌లైన్‌లో నుంచి నీరంతా ఉబికి వస్తూ బస్తీలో ఓపెన్‌గా పారుతోంది. పేదలు నివాసం ఉండే ఈ బస్తీలో పిల్లలు మురుగులోనే ఆడుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవి సెలవుల్లో.. జలకాలాటల్లో !

- చిన్నారులతో స్విమ్మింగ్‌పూల్స్ కళకళ
- చిన్నారులతో కలిసి పెద్దలూ సందడి

సైదాబాద్: వేసవి సెలవుల్లో ఎన్ని ఆటలు ఆడినా జలకాలాటల్లో ఉన్న మజానే వేరంటున్నారు చిన్నారులు. కళ్లకు అద్దాలు పెట్టుకొని, నెత్తికి వాటర్ ప్రూఫ్ కవర్లు చుట్టుకొని స్విమ్మింగ్‌పూల్‌లో దిగుతున్న చిన్నారులు..రంగు రంగుల ట్యూబ్‌లతో నీళ్లలో తేలియాడుతూ.. సహచర చిన్నారులపై నీళ్లు చల్లుతూ.. కేరింతలు కొడుతూ వేసవిలో ఉల్లాసంగా సేదతీరుతున్నారు. కొందరు పిల్లల్లో ఉన్న నీటి భయాన్ని పోగొట్టేందుకు పెద్దలు కూడా నీళ్లలోకి దిగి వారితో కలిసి సందడి చేస్తున్నారు.



చంపాపేటలోని ఓ ప్రైవేట్ స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారుల జలకాలాటలు

చిన్నారులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

వేసవి సెలవుల్లో స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లే వారు కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలి. ఈత రానివారు ఎక్కువలోతు ఉన్నవైపు వెళ్లకూడదు. ట్యూబ్‌తో ఈత నేర్చుకునేవారు కూడా కోచ్ పర్యవేక్షణలో మాత్రమే నీటిలో ఈదాలి. నీళ్లల్లో ఆటలాడే సమయంలో కళ్లకు అద్దాలు, తలకు వాటర్‌ప్రూఫ్ కవర్, చెవుల్లో నీరు పోకుండా అవసరమైన పరికరాలు ఉపయోగించాలి.

రక్షణ చర్యలు పాటించాలి...

మామూలు రోజుల్లో కంటే వేసవి సెలవుల్లో స్విమ్మింగ్‌పూల్‌కు చిన్నారులు ఎక్కువ మంది వస్తుంటారు కాబట్టి వారి సంఖ్యకు అనుగుణంగా కోచ్‌లను, రక్షణ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రక్షణ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండి స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నారుల కదలికలు గమనిస్తూ ఉండాలి. నీళ్లలో ఎక్కువగా కొంటె పనులు చేసే చిన్నారుల పట్ల రక్షణ సిబ్బంది ఎక్కువ అప్రమత్తంగా ఉండాలి.

నీళ్లల్లో ఉల్లాసంగా ఆటలు

సాధారణంగా స్విమ్మింగ్‌పూల్‌లో ఈత రాని చిన్నారుల కోసం ప్రత్యేకంగా తక్కువ లోతు ఉండేలా ఏర్పాటు చేస్తుంటారు. చిన్నారులు నీళ్లల్లో బంతులతో ఆటలు, ఒకరిని మరొకరు పట్టుకునే ఆటలు ఆడుతుంటారు. ఇక గరిష్టలోతు ఉన్న ప్రాంతంలో ఈత వచ్చినవారు వివిధ పద్ధతుల ఈతలతో పోటీలు పెట్టుకొని సందడి చేస్తుంటారు. నీళ్లల్లో తమ పిల్లల సందడిని ఒడ్డున ఉండి చూస్తూ, వారిని ఉత్తేజపరుస్తూ, వారి ఆటలను ఫోన్‌లలో చిత్రీకరిస్తూ తల్లిదండ్రులు మురిసిపోతుండటం వేసవి కాలంలో స్విమ్మింగ్ పూల్‌లలో కనపడుతుంది.



చిన్నారులతో కలిసి సందడి చేస్తున్న పెద్దలు

చిన్నారులకు వారంలో ఈత నేర్పుతాం



చిన్నారులను క్రమం తప్పకుండా తీసుకు వస్తే వారికి ఒక వారంలోపే ఈత వచ్చేలా శిక్షణ ఇస్తాం. కొందరు చిన్నారులకు నీళ్ల భయం ఉంటుంది. మొదట వారిలో నీటి భయం పోగొట్టి ఈత చక్కగా ఆస్వాదించేలా తర్ఫీదునిస్తాం. నీటిలో ఆటలు ఉల్లాసాన్ని కలుగజేస్తాయి. అలానే ఈత అందరికీ చక్కటి వ్యాయామంగా పనిచేస్తుంది. వేసవిలో కొత్తగా ఈత నేర్చుకునేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా కోచ్‌లను నియమించాం. కానీ ఈత నేర్చుకోవాలంటే నిర్దిష్టమైనన్ని రోజులు వారు తప్పనిసరిగా పూల్‌కు రావాలి.

– గాజుల శివకుమార్, నిర్వాహకుడు

రక్షణ చర్యలకు ప్రాధాన్యం



ఈత కొట్టేందుకు వచ్చేవారి కోసం, ఉల్లాసంగా గడిపేందుకు వచ్చేవారి రక్షణ కోసం స్విమ్మింగ్‌పూల్‌లో ప్రాధాన్యం ఇస్తున్నాం. స్విమ్మింగ్‌పూల్ చుట్టూ ఉండే రక్షణ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉంటాం. ఈత రాని వారిని గరిష్టలోతు వైపు అసలు అనుమతించం. స్విమ్మింగ్‌పూల్‌ను నియమాల ప్రకారం ప్రతీరోజు శుభ్రపరుస్తాం. ఈతకు వెళ్లే ముందు, ఈత కొట్టిన తర్వాత తప్పని సరిగా మామూలు నీటితో స్నానం చేసేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశాం.

– ఎ.రాజశేఖర్‌రెడ్డి, జేఎస్‌ఆర్ స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకుడు

అంకిత భావంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

చాదర్‌ఘాట్: విద్యార్థుల భవిష్యత్ అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మలక్‌పేట శ్రీవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ సుభాష్‌గౌడ్ అన్నారు. శ్రీవాణి మహిళా డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ డే కార్యక్రమాన్ని మలక్‌పేట సిమ్లా గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యుత్తమ అధ్యాపక బృందంతో అధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నామన్నారు. విద్యార్థులు అంకిత భావంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాసంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు, పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన పురస్కారాలు అందజేశారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాజేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ విమలారెడ్డి, అధ్యాపకులు అనుప్రియ, జాన్, హమీదుల్లాఖాన్, రాములు, గిరిధర్, కార్తీక్‌లాల్ పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రిసోర్స్ పర్సన్స్ సేవలు వెల కట్టలేనివి: ఎమ్మెల్యే



రిసోర్స్ పర్సన్స్‌కు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కరోనా సమయంలో రిసోర్స్ పర్సన్స్ ఎనలేని సేవ చేశారని, ఇంటింటికీ తిరిగి ప్రజకు మహమ్మారిపై అవగాహన కలిగించారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కొనియాడారు. శనివారం ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 50 మంది రిసోర్స్ పర్సన్స్‌కు డ్రెస్ కోడ్ ఉన్న చీరలను అందజేశారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, రిసోర్స్ పర్సన్స్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కూడా ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలే తెలంగాణలోనూ ఖాయం

కాంగ్రెస్ పార్టీ నేత మల్‌రెడ్డి రాంరెడ్డి



కర్ణాటక ఫలితాలపై విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చైతన్యపురి: కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాలే తెలంగాణలోనూ రావటం ఖాయమని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించటంతో చైతన్యపురిలోని నియోజకవర్గ కార్యాలయం వద్ద మల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ, కర్ణాటకలో అధికార పార్టీ దొంగ హామీలు, అవినీతి, అక్రమాలకు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలు, అక్రమాలకు ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఆ పార్టీని ఓడించేందుకు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆయా డివిజన్ల నాయకులు సంకెపల్లి సుధీర్‌రెడ్డి, నరసింహ యాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, బండా సురేందర్‌రెడ్డి, బద్దుల వేణుయాదవ్, మంజులారెడ్డి, మతిన్‌బాయ్, జైపాల్‌రెడ్డి, జానీబాబా, షరీఫ్ పాల్గొన్నారు.

సైదాబాద్‌లో...



సైదాబాద్‌లో మిఠాయిలు పంచుతున్న మదన్‌బాబు

సైదాబాద్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన విజయం సాధించిన నేపథ్యంలో శనివారం సైదాబాద్‌లోని మలక్‌పేట ఏసీపీ కార్యాలయం చౌరస్తా వద్ద మలక్‌పేట నియోజకవర్గ బి–బ్లాక్ అధ్యక్షుడు మదన్‌బాబు ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. రహదారిపైన పాదచారులు, వాహనదారులకు వారు మిఠాయిలు పంచారు. నాయకులు కావేటి శ్రీకాంత్, ధనుంజయ్, శ్రీనివాస్, వెంకటేష్, మధు, తిరుమల్‌రెడ్డి, వినోద్‌కుమార్, మోహిత్, షకీల్ పాల్గొన్నారు.

మలక్‌పేటలో..

మలక్‌పేట: కర్ణాటక అసెంబ్లీ ఎన్నిల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో మూసారంబాగ్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ నాయకులు లింగాల శ్రీనివాస్, యాదిలాల్, సూర్య ప్రకాశ్, సాయిరామ్, మహేష్, శివ, కృష్ణ, మనీష్, అనిరుధ్ పాల్గొన్నారు.



పార్టీ నాయకులకు మిఠాయి తినిపిస్తున్న చెకోలేకర్ శ్రీనివాస్


జక్కిడి ఆధ్వర్యంలో...



ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో కాంగ్రెస్ నేతల సంబురాలు

మన్సూరాబాద్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినందుకు టీపీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో శనివారం సంబురాలు జరుపుకున్నారు. మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మిఠాయిలు పంచి, బాణసంచా కాల్చారు. ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, బుడ్డ సత్యనారాయణ, రాజేశ్వరి, శ్యాంసుందర్‌రెడ్డి, గంట శ్రావణ్, స్వామి పాల్గొన్నారు.

ఆర్‌కే పురంలో...



ఆర్‌కేపురంలో మిఠాయిలు పంచుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, రామకృష్ణా పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, అల్లే కుమార్, పోతర్ల తిరుపతయ్య, రాఘవేందర్ రెడ్డి, శశికంత్ రెడ్డి, రాజు నాయక్, చెపంగి ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, ఆర్‌కేపురంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలు చౌరస్తాల్లో సంబురాలు జరుపుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సేవలు అభినందనీయం



చిన్నారులకు వ్యాక్సిన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: మహిళలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సేవలు అభినందనీయమని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి కొనియాడారు. శనివారం కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని త్రీటెంపుల్ చౌరస్తాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో నవజాత శిశువుల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సిన్ ప్రక్రియను పర్యవేక్షించారు. కేంద్రంలో కొనసాగుతున్న అదనపు అభివృద్ధి పనుల గురించి కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సైదాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్ అరుణ, సిస్టర్ నీలిమ పాల్గొన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి: ఎస్‌టీపీఎఫ్

మన్సూరాబాద్: దేశంలో ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు వ్యాపారంగా మార్చాయని, ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల అభ్యర్థులు వందల కోట్లు ఖర్చుపెడుతున్నారని సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ (ఎస్‌టీపీఎఫ్) చైర్మన్ ప్రొఫెసర్ మురళీమనోహర్ అన్నారు. ఎస్‌టీపీఎఫ్ రంగారెడ్డి జిల్లా సదస్సును మన్సూరాబాద్ ఎస్కే గార్డెన్స్‌లో శనివారం నిర్వహించారు. సదస్సుకు ఆయనతో పాటు ఫ్రంట్ కన్వీనర్ బొంగు ప్రసాద్, సోషల్ జస్టిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చామకూర రాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీమనోహర్ మాట్లాడుతూ, దేశంలో 85 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజకీయంగా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికలే చివరి ఎన్నికలన్నారు. బొంగు ప్రసాద్ మాట్లాడుతూ, సామాజిక తెలంగాణ కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. దేశ సంపద ఒకశాతం ఉన్న వర్గాల చేతిలో ఉందని, బీసీ ప్రధానిగా ఉన్నప్పటికీ కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఫ్రంట్ అభ్యర్థులు అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తారన్నారు. నాయకులు కేవిగౌడ్, మంగలిపల్లి శంకర్, లక్ష్మణ్, నాగేష్, ఓరుగంటి వెంకటేష్, అంజియాదవ్, ప్రభంజన్‌యాదవ్, ఆకర్ష్, సులోచన, మమత పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతన్న ప్రొ. మురళీమనోహర్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన కానిస్టేబుల్



ఆత్మహత్యాయత్నం చేసిన మంగ్రా

నాగోలు: ఫ్లైఓవర్‌పై ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ రక్షించాడు. పోలీసుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం గుమ్లా జిల్లా పార్గవ్ గ్రామానికి చెందిన మంగ్రా ఉపాధి కోసం గత కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. ఎల్‌బీనగర్‌లో నివాసం ఉంటూ భవన నిర్మాణ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతను శుక్రవారం ఎల్‌బీనగర్–హయత్‌నగర్ ఫ్లైఓవర్ ఎక్కి అక్కడి నుంచి దూకేస్తానంటూ అరిచాడు. సమీపంలో విధుల్లో ఉన్న ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సతీష్ అతడిని మాటల్లో పెట్టి చాకచక్యంగా కిందకు తీసుకొచ్చారు. అనంతరం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు పంపించగా, వారు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడేంత పిరికివాడు కాడని మంగ్రా కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని కాపాడిన కానిస్టేబుల్ సతీష్‌ను అధికారులు అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

బడంగ్‌పేట్: ప్రత్యేక నిధులతో నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్నామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా మంత్రి సబితారెడ్డి హాజరయ్యారు. కార్పొరేషన్ పరిధిలోని 20, 21, 23, 28, 31, 32 డివిజన్ల పరిధిలో రూ.9.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డివిజన్‌ను ఒక ప్రాతిపాదికన తీసుకుని సౌకర్యాల కల్పనకు అడుగులు వేస్తున్నామని అన్నారు. కనీస సౌకర్యాల కల్పన కోసం కార్పొరేషన్ నిధులతో పాటు ప్రత్యేక నిధులు తెచ్చి అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని రెండు మున్సిపల్ కార్పొరేషన్‌లు, రెండు మున్సిపాలిటీల్లో రూ.2 కోట్లతో మోడ్రన్ దోభీఘాట్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.